# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 14-05-2025 సమయం : సాయంకాలం 6 గం. 30 ని. లు

## ముఖ్యాంశాలు

- ఆంధ్రప్రదేశ్ లో 42 లక్షలు మంది పశుసంపదపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.

- రాష్ట్రంలో ఈరోజు రెండు వేరు వేరు చోట్ల చెరువులో ఈతకు దిగి 8 మంది ప్రాణాలు కోల్పోయారు.

- బుడమేరుకు గత సంవత్సరం అత్యవసరంగా పూడ్చిన 3 గండ్లు కలిపి రిటైనింగ్ వాల్ ను నిర్మిస్తున్నామని మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు.

- రెసిడెన్షియల్ కళాశాలల్లో ప్రవేశాల కోసం నిర్వహించే ఏపీఆర్‌జేసీ, ఏపీఆర్‌డీసీ పరీక్షల ఫలితాలు కొద్ది సేపటి క్రితం విడుదలయ్యాయి.

- విశాఖ, విజయవాడ మెట్రో రైల్ ప్రాజెక్టుల నిర్మాణానికి రుణాలు ఇచ్చేందుకు విదేశీ బ్యాంకులు ఆసక్తి కనబరుస్తున్నాయని రాష్ట్ర పురపాలక పట్టణాబివృద్ధి శాఖ తెలిపింది.

=====================

దేశంలో సూక్ష్మ సేద్యానికి ఆంధ్రప్రదేశ్ చిరునామాగా ఉందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. విజయవాడలో పశుసంవర్ధక శాఖ టెక్ ఏఐ 2.0 కాంక్లేవ్ ను ఈరోజు ఆయన ప్రారంభించారు. అనంతరం ముఖ్యమంత్రి ప్రసంగిస్తూ.. సాంకేతికతను అన్ని రంగాల వారూ అందిపుచ్చుకోవాలన్నారు. రాష్ట్రంలో 42 లక్షలు మంది పశుసంపదపై ఆధారపడి జీవిస్తున్నారని, 13.5 శాతం జీఎస్టీ వసూళ్లు దీని ద్వారా నమోదవుతున్నాయని ముఖ్యమంత్రి వెల్లడిస్తూ...

(వాయిస్ 34 సెకన్లు)

అంతకు ముందు ఈ కాంక్లేవ్‌లో పలు అంకుర సంస్థల ప్రతినిధులు వివిధ అంశాలను ముఖ్యమంత్రికి వివరించారు. మనుషులకు ఉన్న ఆధార్ తరహాలో పశువులకు గోదార్‌ను తీసుకువస్తున్నామని ఆ సంస్థలు ముఖ్యమంత్రికి వెల్లడించాయి. దీనిపై ఆసక్తి చూపిన చంద్రబాబునాయుడు.. తిరుపతి జిల్లాను పైలెట్ ప్రాజెక్టుగా తీసుకోవాలని సూచించారు. కోళ్లకు వచ్చే వ్యాధులను గుర్తించటం, వాటి ఆరోగ్య విషయాలను తెలియజేసే ప్రత్యేక యాప్ ను తీసుకురావాలని ముఖ్యమంత్రి అంకుర సంస్థలను కోరారు.

=====================

రాష్ట్రంలో ఈరోజు రెండు వేరు వేరు చోట్ల చెరువులో ఈతకు దిగి 8 మంది ప్రాణాలు కోల్పోయారు. ఏలూరు జిల్లాలోని భీమడోలు సమీపంలోని చెరువులో ఈతకు వెళ్ళిన అయిదుగురిలో ముగ్గురు మునిగిపోవడంతో మృతి చెందారు. మరో ఇద్దరు గల్లంతయ్యారు. సమాచారం అందుకున్న పోలీసులు, ఫైర్ సిబ్బంది ఘటనాస్థలికి చేరుకొని గల్లంతైన వారి కోసం గాలిస్తున్నారు. ఇక మరొక ప్రమాదంలో వైఎస్సార్ కడప జిల్లా బ్రహ్మంగారిమఠం మండలం మల్లేపల్లె చెరువులో ఈతకు వెళ్ళిన ఐదుగురు బాలురు మృతి చెందారు. వేసవి సెలవులు కావటంతో స్నేహితులతో కలిసి ఈత కొట్టేందుకు నిన్న మల్లేపల్లె చెరువులోకి దిగిన ఐదుగురు నీటిలో మునిగిపోవడంతో వారి ఆచూకీ గల్లంతయ్యింది. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న పోలీసులు చెరువు వద్దకు చేరుకుని గాలింపు చర్యలు చేపట్టగా నిన్న అర్ధరాత్రి ఐదుగురి మృతదేహాలు లభ్యమయ్యాయి. ఈ ఘటనపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్ మోహన రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఇటువంటి దుర్ఘటన చోటు చేసుకోవడం అత్యంత బాధాకరమని, మృతుల కుటుంబాలను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.

=====================

రాష్ట్ర జలవనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు గత సంవత్సరం బుడమేరు వరదకు కారణమయిన గండ్లు పడిన ప్రాంతాలను ఈరోజు పరిశీలించారు. గత సంవత్సరం అత్యవసరంగా పూడ్చిన 3 గండ్లు కలిపి రిటైనింగ్ వాల్ నిర్మాణం కోసం పనులు మొదలు పెట్టబోతున్నామని వివరించారు. వర్షాలు మొదలయ్యేలోగా ఈ మూడు గండ్ల నిర్మాణ పనులు పూర్తి చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు. బుడమేరు డైవర్షన్ కెనాల్ ను 37 వేల 500 క్యూసెక్కులకు పెంచేలా.. మిగిలిన పనులు పూర్తి చేసేలా ప్రతిపాదనలు సిద్ధం చేశామని, జూన్ 10 నాటికి రిటైనింగ్ వాల్ నిర్మాణం పూర్తి కావాలని ఆదేశాలు జారీ చేశామని మంత్రి నిమ్మల రామానాయుడు వివరిస్తూ...

(వాయిస్ 37 సెకన్లు)

విరామం

=====================

రాష్ట్రంలోని గురుకుల పాఠశాలలు, జూనియర్ డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన ఏపీఆర్‌జేసీ (APRJC), ఏపీఆర్‌డీసీ(APRDC) పరీక్షల ఫలితాలు ఈరోజు విడుదలయ్యాయి. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఈ ఫలితాలను ఏపీ గురుకుల విద్యాలయాల సంస్థ (APREIS) వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచామని తెలిపారు. కాగా ఏప్రిల్ 25న గురుకుల పాఠశాలల్లోని 5, 6, 7, 8 తరగతుల్లో ప్రవేశాల కోసం ఏపీ రెసిడెన్షియల్ స్కూల్స్ కామన్ అడ్మిషన్ టెస్ట్ (APRSCAT)తో పాటూ ఏపీఆర్‌జేసీ (APRJC), ఏపీఆర్‌డీసీ (APRDC) ప్రవేశ పరీక్షలు నిర్వహించారు.

=====================

విశాఖ, విజయవాడ మెట్రో రైల్ ప్రాజెక్టుల నిర్మాణానికి రుణాలు ఇచ్చేందుకు విదేశీ బ్యాంకులు ఆసక్తి కనబరుస్తున్నాయని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ఈరోజు ఒక ప్రకటనలో తెలిపింది. ఈ రెండు మెట్రో ప్రాజెక్ట్ లకు 12 వేల కోట్ల రూపాయలు అవసరమవుతాయని, అందులో భాగంగా విశాఖ మెట్రోకు 6 వేల 100 కోట్లు, విజయవాడ మెట్రోకు 5 వేల 900 కోట్ల రూపాయల రుణం సమీకరించాలని ఆంధ్రప్రదేశ్ మెట్రో రైల్ కార్పొరేషన్ లిమిటెడ్ (APMRL) నిర్ణయించింది. తక్కువ వడ్డీకి ఋణమిచ్చే బ్యాంకులతో APMRL ఎండీ రామకృష్ణారెడ్డి ఈరోజు ఆయన కార్యాలయంలో సంప్రదింపులు జరుపుతున్నారు. కాగా నిన్న విజయవాడలో ప్రతిపాదిత మెట్రో కారిడార్ లను క్షేత్రస్థాయిలో పరిశీలించిన ఆసియన్ ఇన్ ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్మెంట్ బ్యాంక్ (AIIB) ప్రతినిధులు అనంతరం రామకృష్ణారెడ్డితో సమావేశమయ్యారు.

=====================

రైతులకు పెట్టుబడి రాయితీ కింద ఆర్థిక సహాయం అందించే “అన్నదాత సుఖీభవ” పథకానికి సంబంధించిన అర్హుల జాబితా సిద్ధం చేస్తున్నామని శ్రీకాకుళం జిల్లా వ్యవసాయ శాఖ సంయుక్త సంచాలకులు కోరాడ త్రినాథ స్వామి తెలిపారు.

ఈరోజు ఆయన శ్రీకాకుళంలో పాత్రికేయులతో మాట్లాడుతూ... జిల్లాలో ఉన్న 5 లక్షల 90 వేల మంది రైతులకు లబ్ధి చేకూరే ఈ పథకానికి సంబంధించి గ్రామాల్లో లబ్ధిదారుల వెరిఫికేషన్ జరుగుతోందని వెల్లడించారు. వెబ్ ల్యాండ్ డేటా ఆధారంగా అన్నదాత సుఖీభవ పథకం కింద రైతులకు నగదు జమ చేస్తామని చెప్పారు. గ్రామాల్లో వ్యవసాయ శాఖ, రెవెన్యూశాఖ అధికారుల ఆధ్వర్యంలో లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ ఈ నెల 20వ తేదీ వరకు జరుగుతుందని వెల్లడించారు. ఈ పథకానికి అర్హత కలిగిన వారు 1B, ఆధార్ జెరాక్స్ లతో రైతు సేవా కేంద్రాలను సంప్రదించాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం మూడు విడతలుగా అందిస్తున్న పిఎం కిసాన్ అన్న యోజన, కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చిన 14 వేల రూపాయలు కలిపి మొత్తం 20 వేల రూపాయలు రైతుల ఖాతాల్లోకి జమ అవుతుందని ఆయన స్పష్టం చేశారు.

=====================

"ఆపరేషన్ సిందూర్" విజయవంతమవడం పట్ల దేశ వ్యాప్తంగా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. ఉగ్రవాదాన్ని ధీటుగా ఎదుర్కొనే సామర్థ్యం భారత్ కు ఉందని, ప్రపంచానికి రుజువయ్యిందని దేశ పౌరులు, సామాజిక సంస్థలు, రాజకీయ పార్టీలు పేర్కొంటున్నాయి. అందులో భాగంగా భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు కె.సుహాసిని ఆనంద్ ఈరోజు ఆకాశవాణితో మాట్లాడుతూ...

(వాయిస్ 30 సెకన్లు)

=====================

ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల నియామకాల కోసం చేపడుతున్న మెగా డీఎస్సీ -2025 కి దరఖాస్తు చేసుకునేందుకు ఆఖరి గడువు రేపటితో ముగియనుందని పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ తెలియజేశారు. కావున అర్హత, ఆసక్తి కలిగిన అభ్యర్థులు త్వరితగతిన దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు.

=====================

అండమాన్ నికోబార్ దీవులతో పాటూ బంగాళాఖాతంలోని మరి కొన్ని ప్రాంతాలలో నైరుతి రుతుపవనాలు మరింత ముందుకు సాగడానికి పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. వీటి ఫలితంగా రాష్ట్రంలో కొన్నిచోట్ల రాగల మూడు రోజులు తేలికపాటి నుండి ఒక మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ వెల్లడించింది. బలమైన ఈదురు గాలులు గంటకు 40 నుండి 50 కిలోమీటర్ల వేగంతో వీచే అవకాశం ఉందని హెచ్చరించింది.

=====================
=====================